# రాత్రికి రాత్రే వెలిసిన షెడ్డు




ఖని మార్కెట్‌లో వెలిసిన షెడ్డు

కోల్‌సిటీ, డిసెంబర్ 18: గోదావరిఖని నడిబొడ్డున రాత్రికి రాత్రే ఓ షెడ్డు వెలిసింది. ఆదివారం సెలవు దినం కావడంతో నగర పాలక అధికారులు, సిబ్బంది ఎవరూ కూడా క్షేత్ర స్థాయిలో ఉండరన్న విషయాన్ని గమనించి వ్యక్తి ఒకరు రాత్రికి రాత్రే ఈ నిర్మాణం చేపట్టినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. గోదావరిఖనిలోని ప్రధాన కూరగాయల మార్కెట్‌లోని మాంసం దుకాణాల పక్కన ఉన్న ఖాళీ స్థలంలో వెలిసిన ఈ షెడ్డు నిర్మాణం చూసి సోమవారం ఉదయం మార్కెట్‌కు వచ్చిన వ్యాపారులు, వినియోగదారులు, స్థానికులు ఒక్కసారిగా విస్తుపోయారు. రాత్రి వరకు ఖాళీగా ఉన్న స్థలంలో తెల్లారేసరికి షెడ్డు నిర్మాణం చేపట్టడంపై అభ్యంతరాలు వ్యక్తం చేశారు. నిత్యం రద్దీగా ఉండే ప్రధాన కూరగాయల మార్కెట్‌లో ఖాళీ స్థలంలో ఓ షెడ్ హఠాత్తుగా వెలిసినా నగర పాలక అధికారులు, సిబ్బంది ఎవరూ పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తున్నది. నగరం నడిబొడ్డున ఉన్న ప్రధాన కూరగాయల మార్కెట్‌లో రాత్రికి రాత్రే షెడ్ నిర్మాణం జరిగినా ఎందుకు పట్టించుకోవడం లేదంటూ ప్రశ్నిస్తున్నారు.

**ఆ నిర్మాణానికి అనుమతి లేదు :**

**సీహెచ్ నాగేశ్వర్, బల్దియా కమిషనర్**

ఇదిలా ఉండగా, స్థానిక ప్రధాన కూరగాయల మార్కెట్‌లోని మాంసం దుకాణాల పక్కన ఖాళీ స్థలంలో వెలిసిన నిర్మాణానికి సంబంధించి నగర పాలక సంస్థ నుంచి ఏలాంటి అనుమతులు లేవు. ఎవరు కూడా అక్కడ నిర్మాణానికి అనుమతి తీసుకోలేదు.ఆ నిర్మాణంపై వెంటనే విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటాం.

# వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య

పెద్దపల్లి కమాన్, డిసెంబర్ 18: అత్తింటివారి వరకట్న వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన పెద్దపల్లి మండలం హన్మంతునిపేట గ్రామంలో జరిగింది. పెద్దపల్లి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రామగిరి మండలం బేగంపేట గ్రామానికి చెందిన గోగుల మౌనిక (తీగల సాధన)కు పెద్దపల్లి మండలం హన్మంతునిపేటకు చెందిన తీగల రాజ్‌కుమార్‌తో రెండేళ్ల క్రితం వివాహమైంది. వీరికి 9 నెలల బాబు ఉన్నాడు. ఈ క్రమంలో మౌనికను భర్త రాజ్‌కుమార్, అత్త యశోద, మామ పోశాలు అదనపు కట్నం తేవాలని వేధిస్తున్నారు. దీంతో మనస్తాపానికి గురైన ఆమె సోమవారం ఉదయం 4 గంటలకు హన్మంతునిపేటలోని ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. తల్లి గోగుల సమ్మక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపల్లి ఏసీపీ ఎడ్ల మహేశ్ తెలిపారు.

**మద్యానికి బానిసై..**

పెద్దపల్లి టౌన్, డిసెంబర్ 18: పెద్దపల్లి పట్టణంలోని అమర్‌నగర్ పాత కోర్టు పక్కవీధిలో నివసించే సామ చంద్రశేఖర్ (32) మద్యం తాగడానికి బానిసై సోమవారం రాత్రి 10గంటలకు ఆత్మహత్య చేసుకునట్లు ఏఎస్ఐ రవీందర్ తెలిపారు. ఏఎస్ఐ రవీందర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గత ఏడాది భార్యకు విడాకులు ఇచ్చిన చంద్రశేకర్ పట్టణంలో పెయింటింగ్ పని చేస్తూ తల్లిదండ్రులతో ఉంటున్నాడు. కొద్ది రోజులుగా విపరీతంగా మద్యానికి బానిసయ్యాడు. సోమవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు వివరించారు. తండ్రి తిరుపతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తునట్లు ఏఎస్ఐ తెలిపారు.

**మద్యం మత్తులో పురుగుల మందు తాగి..**

ముత్తారం, డిసెంబర్ 18: మద్యం మత్తులో పురుగుల మందుతాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సీతంపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. ముత్తారం పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన లింగం పోచయ్య (58) వ్యవపాయ కూలీగా జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 16న ఉదయం సుమారు 10–30 గంటల ప్రాంతంలో మద్యం మత్తులో ఇంట్లోఉన్న పురుగుల మందు తాగాడు. పురుగుల మందు తాగిన విషయం కుటుంబ సభ్యులకు తెలుపగా వెంటనే మంథనిలోని ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌లోని ఓ ప్రవేట్ హాస్పిటల్‌లో చేర్పించారు. చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించి సోమవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో చనిపోయాడు. మృతునికి భార్య సారమ్మ, కుమారుడు నరేష్ ,ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మధుసూదన్ రావు తెలిపారు.

# సీసీ రోడ్డు, భూగర్భ డ్రైనేజీ పనులను ప్రారంభం

గోదావరిఖని, డిసెంబర్ 18: 29వ డివిజన్‌లో సోమవారం పట్టణ ప్రగతి నిధులు రూ. 14 లక్షలతో సీసీ రోడ్డు, భూగర్భ డ్రైనేజీ పనులకు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్, ఆయన సతీమణి మనాలి రాజ్‌కుమార్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. కార్యక్రమంలో మేయర్ అనిల్ కుమార్, కమిషనర్ నాగేశ్వరరావు, కార్పొరేటర్ మహంకాళి స్వామి, నాయకులు పాల్గొన్నారు.

## నేటి నుంచి వృత్తి శిక్షణ తరగతులు ప్రారంభం

గోదావరిఖని, డిసెంబర్ 18: సింగరేణి ఆర్జీ–1 సేవా సమితి ఆధ్వర్యంలో నిరుద్యోగ మహిళలకు సామాజిక బాధ్యత స్వయం ఉపాధి కల్పనలో భాగంగా జీవనోపాధి కల్పించేందుకు మహిళలకు ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా వారిని ప్రోత్సహించేందుకు టైలరింగ్, మగ్గం వర్క్స్, బ్యుటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్ తదితర వృత్తి శిక్షణ తరగతులను మంగళవారం ఆర్‌సీఓఏ క్లబ్‌లో ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ హాజరై ప్రారంభించనున్నట్లు ఏజీఎం లక్ష్మీనారాయణ తెలిపారు. సేవా సభ్యులు, మహిళలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతల స్వీకరణ

మంథని, డిసెంబర్ 18: మంథని మున్సిపల్ కమిషనర్‌గా గుట్టల మల్లికార్జున స్వామి సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. రంగారెడ్డి జిల్లా బొల్లారం మున్సిపాలిటీలో మేనేజర్‌గా విధలు నిర్వహిస్తున్న మల్లిఖార్జునస్వామి మంథనికి బదిలీపై రాగా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన మల్లికార్జున స్వామికి ఉద్యోగులు పదవీ బాధ్యతలు స్వీకరణ శుభాకాంక్షలు తెలుపడంతో పాటు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఆనంతరం ఆయన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును మర్యాద పూర్వకంగా కలిశారు.

## ఇండ్ల స్థలాల కోసం

# మహిళల పోరుబాట

- జగిత్యాల జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ
- ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేత



ఇండ్ల స్థలాల పట్టాలు ఇవ్వాలంటూ ర్యాలీ తీస్తున్న సీపీఎం నాయకులు, మహిళలు

జగిత్యాల కలెక్టరేట్, డిసెంబర్ 18: తమకు ఇండ్ల స్థలాలు కేటాయించాలంటూ సీపీఎం ఆధ్వర్యంలో మహిళలు జగిత్యాలలో సోమవారం భారీ ర్యాలీ తీశారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చి ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం జగిత్యాల ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. జగిత్యాల శివారులోని టీఆర్‌నగర్, నర్సింగాపూర్ శివార్లలో ఉన్న ప్రభుత్వ, పోరంబోకు భూముల్లో వివిధ ప్రాంతాలకు చెందిన మహిళలు కొద్ది రోజులుగా గుడిసెలు వేసుకుంటున్నారు. ఈ క్రమంలో గుడిసెలు వేసుకున్న సుమారు ఐదు వేల మంది సీపీఐ నాయకులతో కలిసి జగిత్యాల కలెక్టరేట్ ఆవరణలో సమావేశమయ్యారు. అనంతరం అక్కడి నుంచి ర్యాలీగా జగిత్యాల ఆర్డీవో కార్యాలయానికి వెళ్లి టీఆర్‌నగర్, నర్సింగాపూర్ గ్రామాల్లోని పోరంబోకు, ప్రభుత్వ భూముల్లో ఇండ్ల స్థలాలు కేటాయించాలని ఆర్డీవోకు వినతిప్రతం అందజేశారు. కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు లెల్లల బాలకృష్ణ మాట్లాడుతూ టీఆర్‌నగర్‌లోని సర్వే నంబర్ 437/112/2లో 220ఎకరాల ప్రభుత్వ స్థలంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న వేలాది మంది ఇండ్లు లేని పేదవారికి 120గజాల చొప్పున స్థలం, ఇంటి నిర్మాణానికి ₹15లక్షల ఆర్థిక సహాయాన్ని అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కన్వీనర్ గగులోత్ తిరుపతినాయక్, సీపీఎం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



ఇండ్ల స్థలాలు కేటాయించాలని ఆర్డీవోకు వినతిపత్రాన్ని అందజేస్తున్న సీపీఎం నాయకులు, మహిళలు

## సింగరేణి ఎన్నికలపై తీర్పు 21కి వాయిదా

గోదావరిఖని, డిసెంబర్ 18 : సింగరేణిలో ఈనెల 27న జరగాల్సిన గుర్తింపు సంఘం ఎన్నికలకు సంబంధించి తీర్పును హైకోర్టు ఈ నెల 21వ తేదీకి వాయిదా వేసింది. ప్రభుత్వ ఇంధన కార్యదర్శి సింగరేణిలో ప్రస్తుత పరిస్థితుల్లో ఎన్నికలు నిర్వహించే పరిస్థితి లేదని, మార్చిలో నిర్వహించే అవకాశం ఉంటుందని పేర్కొంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయడంతో సోమవారం పరిశీలించిన హైకోర్టు దీనిపై యాజమాన్యం కౌంటర్ దాఖలు చేయాలని పేర్కొంటూ తీర్పును ఈనెల 21కి వాయిదా వేసింది. సింగరేణిలో ఎన్నికలు దగ్గర పడుతుండడం.. హైకోర్టు ఏ తీర్పు ఇస్తుందో తెలియక కార్మిక సంఘాల గందరగోళానికి గురవుతున్నాయని, ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఇప్పటికే పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, ఇతర అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి కావడం రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుత పరిస్థితిలో ఎన్నికలు నిర్వహించలేమని పేర్కొంటూ పిటిషన్ దాఖలు చేయడంతో 27న జరుగుతాయా? లేక వాయిదా పడతాయా? అన్నది సస్పెన్స్‌గా ఉంది. ఇదిలా ఉంటే కొన్ని కార్మిక సంఘాలు మాత్రం గనులపై గేట్ మీటింగ్‌లు పెడుతూ కార్మికులను ఓట్లు అడుగుతున్నాయి.

## బాలికా సాధికారత కమిటీలు ఏర్పాటు చేయాలి

కార్పొరేషన్, డిసెంబర్ 18: ప్రభుత్వ పాఠశాలల్లో బాలికా సాధికారత కమిటీలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. నగరంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ఆమె కస్తూర్బా విద్యార్థులు, సంక్షేమశాఖ అధికారులతో బాలికా సాధికారతపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ, బాలికల భవిష్యత్‌ను తీర్చిదిద్దడానికి మంచి వినోదభరితమైన వాతావరణంలో విద్యతో పాటు ఉన్నత విలువలను నేర్పాలన్నారు. మంచి పౌరులుగా ఎదగడానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. బాలికా సాధికారత కమిటీలను ఏర్పాటు చేసి బాల్యవివాహాలు, లైంగిక దాడులు, లింగవివక్ష, ఆరోగ్య సమస్యలు వంటివాటిని ధైర్యంగా ఎదుర్కొనేలా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఆడపిల్లలు అన్ని రంగాల్లో ముందుండాలని తెలిపారు. కాగా, బాలికలకు, మహిళా ఉద్యోగులకు స్నేహితా బ్యాడ్జీలను కలెక్టర్ అందజేశారు. సమావేశంలో సంక్షేమశాఖ అధికారి సరస్వతి, డీఎంహెచ్‌వో లలితాదేవి, డీఈవో జనార్దన్‌రావు, డీఆర్డీవో శ్రీలత, జిల్లా మార్కెటింగ్ అధికారి పద్మావతి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ ధనలక్ష్మి, సఖీ సెంటర్ నిర్వాహకురాలు లక్ష్మి, డీసీడీవో కృపారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్ల నిరసన

చొప్పదండి, డిసెంబర్ 18: రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంపై సోమవారం చొప్పదండి పట్టణంలో మండల ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ నేతలు మాట్లాడుతూ, ప్రయాణికులంతా బస్సుల్లోనే వెళ్లడంతో తాము ఉపాధి కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తమను ఆదుకోవాలని, లేనిపక్షంలో తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## నేడు మండల సమావేశం

కొత్తపల్లి, డిసెంబర్ 18: కొత్తపల్లి ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ, ప్రాథమిక విద్యాశాఖ, వైద్య, ఆరోగ్యశాఖ, గ్రామీణ నీటి సరఫరా, రెవెన్యూ, రోడ్లు భవనాలతో పాటు ఇతర శాఖలపై చర్చిస్తామని తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

# సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విక్రయిస్తే చర్యలు

- **మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్**



అవగాహన కల్పిస్తున్న కమిషనర్ శ్రీనివాస్

కార్పొరేషన్, డిసెంబర్ 18: సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ హెచ్చరించారు. కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని ప్లాస్టిక్ హోల్‌సేల్, రిటైల్ షాపులు, హోటళ్లు, రెస్టారెంట్ల యజమానులకు ప్లాస్టిక్ నిషేధంపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ, నగరంలో ప్లాస్టిక్ వస్తువులు, కవర్ల వాడకం, అమ్మకం నిషేధించాలన్నారు. ప్లాస్టిక్‌కు బదులు జూట్, పేపర్ బ్యాగులు, బట్ట సంచులు, ఎకో ప్లాంట్ వస్తువులే వాడాలని సూచించారు. ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇక్కడ డిప్యూటీ కమిషనర్ సురేశ్, దుకాణాల యజమానులు, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సుకు హాజరైన వ్యాపారులు